క్లుప్తంగా

బీసీల పక్షపాతి సీఎం వైఎస్ జగన్


సంఘ సమావేశంలో మాట్లాడుతున్న దుర్గారావు

కొయ్యలగూడెం : బీసీల పక్షపాతి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని బీసీ చైతన్య సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెలగల దుర్గారావు అన్నారు. స్థానిక బీసీ కమ్యూనిటీ హాల్ వద్ద నిర్వహించిన బీసీ చైతన్య సంక్షేమ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. మంత్రి పదవులు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ డైరెక్టర్లు అనేక రంగాల్లో బీసీలకు ప్రాధాన్యమిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి బీసీలంతా రుణపడి ఉంటారన్నారు. రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి గాడిచర్ల సోమేశ్వరరావు, రాజవరం మాజీ సర్పంచ్ పాముల నాగముని స్వామి, టి ఆంజనేయరాజు తదితరులు పాల్గొన్నారు.

యువత క్రీడలపై మక్కువ పెంచుకోవాలి


క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న సీఐ సత్యనారాయణ

కుకునూరు : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ దాచారం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం డివిజన్ స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను కుకునూరు సీఐ కేవీ సత్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత క్రీడలపై మక్కువ పెంచుకోవడంతో పాటు అందులోని మెళకువలను, నైపుణ్యాలను పెంపొందించుకోగలిగితే భవిష్యత్తులో వారికి మంచి అవకాశాలు లభిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కుంజా నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు కుచ్చర్లపాటి నరసింహరాజు, రావు వినోద్ తదితరులు పాల్గొన్నారు.

వీరేశ్వరస్వామికి విశేష పూజలు


ప్రత్యేక అలంకరణలో వీరేశ్వరస్వామి దర్శనం

జంగారెడ్డిగూడెం రూరల్ : మహాశివరాత్రి మహోత్సవాల్లో భాగంగా తాడువాయి శైవక్షేత్రంలో మంగళవారం శ్రీ అపర్ణ సమేత అనంతేశ్వర స్వామి వారి కల్యాణం నేత్రపర్వంగా నిర్వహించారు. ప్రధానార్చకులు కాళ్లకూరి రవికుమారా శర్మ స్వామి వారి కల్యాణాన్ని జరిపించారు. అలాగే గర్భగుడిలో కొలువై ఉన్న మూలవిరాట్ వీరేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారిని మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మీ దర్శించుకున్నారు. మాజీ ఎంపీటీసీ సత్రం లక్ష్మణరావు, పల్లా గంగాధరరావు, కనికళ్ల ప్రసాద్, ఓరుగంటి నాగేంద్ర ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చింతలపూడిలో ఉచిత వైద్య శిబిరం


రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

చింతలపూడి : స్థానిక లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఏలూరు ఆశ్రం ఆసుపత్రి వైద్యులు రోగులకు జనరల్, ఆర్థోపెడిక్, గైనిక్, ఈఎన్‌టీ, కంటి, చర్మ వ్యాధి పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందచేశారు. రోగుల్లో 15 మందికి మెరుగైన వైద్యం అవసరమని రిఫర్ చేశారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు భగవాన్ శంకర్, కార్యదర్శి కొనకళ్ళ కేశవరావు, క్లబ్ చైర్మన్ గోలి చంద్రశేఖరరెడ్డి, ట్రస్ట్ చైర్మన్ చిల్లపల్లి మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.25 వేల విరాళం


ఆహ్వాన పత్రికను అమీర్‌కు అందజేస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం : స్థానిక శ్రీరుక్మిణి సత్యభామ సమేత శ్రీ మదన గోపాలస్వామి ఆలయ అభివృద్ధికి కొయ్యలగూడెంకి చెందిన ఎస్‌కే అమీర్ భాషా రూ.25 వేల విరాళం అందజేశారు. ఐటీడీఏలో ఎంఈఓగా చేసి ఉద్యోగ విరమణ చేసిన ఆయన మంగళవారం విరాళాన్ని ఆలయ కమిటీ చైర్మన్ మద్దు గోపాలకృష్ణకు అందజేశారు. ఈ సందర్భంగా అమీర్‌ను ఎమ్మెల్యే తెల్లం బాలరాజు ఫోన్లో అభినందించారు. 27వ తేదీ నుంచి ప్రారంభమయ్యే మహోత్సవాలకు హాజరు కావాల్సిందిగా అమీర్‌కు ఆహ్వాన పత్రికను ఆలయ చైర్మన్ గోపి అందజేశారు.

బీసీల అభ్యున్నతి జగన్‌తోనే సాధ్యం


ఎమ్మెల్యే వీఆర్ ఎలీజాను సత్కరిస్తున్న నాయీ బ్రాహ్మణులు

చింతలపూడి : బీసీల అభ్యున్నతి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా అన్నారు. నాయీ బ్రాహ్మణులకు రాష్ట్రంలోని దేవాదాయ కమిటీల్లో ప్రాతినిధ్యం కల్పించిన నేపథ్యంలో మంగళవారం స్థానిక నాయీ బ్రాహ్మణులు వైఎస్సార్ సీపీ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే వీఆర్ ఎలీజాను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎలీజాను సంఘం నాయకులు దుశ్శాలువాతో సత్కరించారు. అనంతరం ఎలీజా మాట్లాడుతూ గతంలో తమ హక్కుల కోసం చంద్రబాబును కలిసిన నాయీ బ్రాహ్మణులను దూషించి తోకలు కత్తిరిస్తానని అవమాన పరిచారని గుర్తుచేశారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మాత్రం బీసీలపై ఉన్న అపారమైన అభిమానంతో ఏటా సెలూన్‌లు నడుపుతున్న నాయీ బ్రాహ్మణ సోదరులకు ఏటా రూ.10 వేలు అందజేస్తున్నారని తెలిపారు. అంతేకాక దేవాదాయ పరిధిలోని దేవాలయాల కమిటీల్లో నాయీ బ్రహ్మణులకు సరైన ప్రాతినిధ్యం కల్పించి వారి ఆత్మగౌరవాన్ని కాపాడారని చెప్పారు. బీసీల ఆర్థిక అభివృద్ధికి అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వచ్చే ఎన్నికల్లో బలపరచాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పరిమి నాగేశ్వరరావు, పట్టణ నాయీ బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు ఆచంట సాయి, ఉపాధ్యక్షులు పరిమి రమేష్, పి.హనుమంతరావు, గౌరవ సలహాదారు కొప్పావు నాగేశ్వరరావు, డి.గంగాధరరావు, పరిమి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక న్యాయం.. సీఎం జగన్ విధానం


ఎమ్మెల్యే తెల్లం బాలరాజు

బుట్టాయగూడెం : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మహాత్మా జ్యోతీరావుపూలే వంటి మహానుభావుల ఆశయాలను ముందుకు తీసుకువెళ్తూ సామాజిక న్యాయానికి బలమైన పునాదులు వేస్తూ రాష్ట్రంలో పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశానికే ఆదర్శమని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వేస్తున్న ప్రతి అడుగులోనూ సామాజిక న్యాయం తన విధానమన్నది స్పష్టంగా కనిపిస్తోందని చెప్పారు. ఎమ్మెల్సీల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీలకు అధిక ప్రాధాన్యత ఇచ్చారని అన్నారు. ఇచ్చిన మాట ప్రకారం ప్రతి వాగ్దానాన్ని నెరవేరుస్తూ వస్తున్నారని పేర్కొన్నారు. గడచిన నాలుగేళ్లలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని చెప్పారు. సామాజిక న్యాయానికి ప్రతిరూపం సీఎం జగన్ అని అన్నారు. పార్టీలో పనిచేసిన ప్రతి ఒక్కరికీ సముచిత స్థానాన్ని కల్పించారని అన్నారు. రాబోయే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పనిచేస్తూ మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డినే ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని, ఆ దిశగా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఆయన కోరారు.

షాపులకు తాళాలు వేసిన మున్సిపల్ అధికారులు

ధర్నాకు దిగిన చాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులు

జంగారెడ్డిగూడెం : స్థానిక బోసుబొమ్మ సెంటర్‌లో ఓ షాపింగ్ కాంప్లెక్స్‌కు సంబంధించి ఆస్తిపన్ను బకాయి ఉండటంతో మునిసిపల్ కమిషనర్ మంగళవారం కాంప్లెక్స్‌లోని షాపులకు తమ సిబ్బందితో వచ్చి తాళం వేయించారు. దీర్ఘకాలంగా ఆస్తిపన్ను బకాయి ఉందని, రెడ్‌నోటీస్ జారీ చేసినా బకాయి చెల్లించకపోవడంతో నిబంధనల ప్రకారం షాపులకు తాళాలు వేసినట్లు కమిషనర్ పి.భవానీ ప్రసాద్ తెలిపారు. దీంతో ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు వందనపు వెంకటేశ్వరరావు, ఛాంబర్ సభ్యులు కమిషనర్ కారును అడ్డుకుని ధర్నా నిర్వహించారు. షాపు యజమాని వద్ద పన్ను బకాయిలు వసూలు చేసుకోవాలని, లేదా తామే పన్ను బకాయి చెల్లిస్తామని ఛాంబర్ అధ్యక్షులు వందనపు వెంకటేశ్వరరావు చెప్పినా తాళాలు తీసేందుకు అధికారులు అంగీకరించలేదు. దీంతో కొద్దిసేపు ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. సీఐ పి.బాల సురేష్‌బాబు, ఎస్సై ఎం.సాగర్‌బాబు, సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఛాంబర్ అధ్యక్షుడు వందనపు వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి పీపీఎస్ చంద్రరావులతో పోలీసులు, మున్సిపల్ అధికారులతో సంప్రదింపులు జరిపారు. కాంప్లెక్స్ యజమాని ఎంజీ సుభద్ర పన్ను బకాయి చెల్లించడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. బకాయి ఉన్న నగదు రూ. 5.35లక్షలు చెల్లించగా, అధికారులు ఆన్‌లైన్ రశీదు ఇచ్చి షాపులకు తాళాలు తెరిచారు. దీంతో పరిస్థితి సర్దుమణిగింది.

కొనసాగుతున్న పన్నుల వసూళ్లు

జంగారెడ్డిగూడెం: పట్టణంలో పన్నుల వసూళ్లు కొనసాగుతున్నట్లు మున్సిపల్ కమిషనర్ పి.భవానీ ప్రసాద్ తెలిపారు. మంగళవారం రూ.7.35 లక్షలు నగదు రూపంలో, రూ.2 లక్షలు చెక్కు రూపంలో వసూలయ్యాయన్నారు. కాగా సంజీవ్ ఇండస్ట్రీ యాజమాన్యం సకాలంలో పన్నులు చెల్లించనందున ఇండస్ట్రీని సీజ్ చేసినట్లు చెప్పారు. ప్రజలు తమ ఇంటి పన్ను, నీటి పన్ను సకాలంలో చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలని కమిషనర్ కోరారు. కార్యక్రమంలో టీపీవో వి.జగదీశ్వరావు, ఏఈ పి.సంధ్యారాణి, ఆర్ఐ ఎన్.సుబ్బారావు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, సచివాలయ సెక్రటరీలు పాల్గొన్నారు.

తెలుగు భాష పరిరక్షణకు కృషి చేయాలి


పంగిడిగూడెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో మాట్లాడుతున్న హెచ్‌ఎం లీలాకుమార్



జంగారెడ్డిగూడెం సీఎస్‌టీఎస్ కళాశాలలో మాట్లాడుతున్న బి.సరస్వతి

ద్వారకాతిరుమల : తెలుగు భాషను ప్రేమిద్దాం.. పరభాషలను గౌరవిద్దామని మండలంలోని పంగిడిగూడెం జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.లీలాకుమార్ అన్నారు. స్థానిక పాఠశాలలో మంగళవారం అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులకు వేమన శతకం నుంచి పద్య పఠనం, మాతృభాషలో విద్యాబోధన అనే అంశంపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించి బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం లీలాకుమార్ అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవానికి గల చారిత్రాత్మక నేపథ్యాన్ని విద్యార్థులకు వివరించారు. అనంతరం తెలుగు ఉపాధ్యాయులు మద్దాల పెద్దిరాజు నన్నయ్య కాలం నుంచి నేటి వరకు తెలుగు భాషా ప్రాశస్త్యాన్ని తెలిపారు. విద్యార్థులంతా మాతృ భాష తెలుగు భాషను ప్రేమించాలని, అలాగే పరిరక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలుగు ఉపాధ్యాయులు సీహెచ్.బుజ్జిబాబు, మల్లయ్య, శారద, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం : స్థానిక సీఎస్‌టీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం నిర్వహించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.శ్రీనివాసరావు అధ్యక్షత జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా చింతలపూడి ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు ఉపన్యాసకురాలు డాక్టర్ బి.సరస్వతి మాట్లాడారు. తెలుగు భాష కమ్మనైనదని, తల్లిపాల వంటిదని, స్వచ్ఛమైనదని, తెలుగు భాష ద్వారా అనేక భాషల్ని సులువుగా నేర్చుకోవచ్చన్నారు. వైస్‌ప్రిన్సిపాల్ బి.శ్రీనివాసరావు తెలుగు భాష ఔన్నత్యాన్ని, గొప్పతనాన్ని తెలియజేశారు. కళాశాల అధ్యాపకులు డాక్టర్ జి.వెంకటలాల్, పి.నాగేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సైన్స్ ప్రదర్శనకు విద్యార్థిని ఎంపిక


జాయింట్ కలెక్టర్, డీఈవో చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న జ్యోత్స్న

లింగపాలెం : విజయవాడలో జరగనున్న రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు రంగాపురం జెడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్న కొండపల్లి జ్యోత్స్న ఎంపికైనట్లు గణిత ఉపాధ్యాయుడు షేక్ ఉస్మాన్ బాషా తెలిపారు. జిల్లా స్థాయిలో ఈనెల 20, 21 తేదీల్లో జరిగిన విద్య వైజ్ఞానిక ప్రదర్శనలో గణితం మోడలింగ్ విభాగంలో త్రిమితీయ (త్రీడి) అకారాలను సులభంగా అవగాహన చేసుకునే ప్రాజెక్ట్‌ను జ్యోత్స్న ప్రదర్శించి జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానం సాధించింది. ఈమేరకు జాయింట్ కలెక్టర్ పి.అరుణ్‌బాబు, డీఈవో పి.రవిసాగర్ చేతుల మీదగా అవార్డును అందుకుంది. అదేవిధంగా ధర్మాజీగూడెం జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థిని కె.అనుప్రియ సైన్సు సబ్జెక్టుకు సంబంధించి వ్యాసరచనలో జిల్లాస్థాయిలో ద్వితీయ స్థానం సాధించినట్లు సైన్స్ ఉపాధ్యాయుడు సాయిరాజ్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినులను ఆయా పాఠశాలల అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

నేడు సచివాలయ కన్వీనర్లు, గృహసారథుల సమావేశం

జంగారెడ్డిగూడెం : పట్టణంలోని ఆలపాటి గంగాభవానీ కళ్యాణ మండపంలో బుధవారం సచివాలయ కన్వీనర్లు, గృహసారథుల పరిచయ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మీడియ కో-ఆర్డినేటర్ చిప్పాడ వెంకన్న మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమ్యే ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.

24న వాహనాల వేలం

చింతలపూడి : చింతలపూడి స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ పరిధిలో పట్టుబడ్డ వాహనాలను ఈ నెల 24న స్థానిక ఎస్ఈబీ స్టేషన్ ఆవరణలో బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు సీఐ సాయి స్వరూప్ మంగళవారం తెలిపారు. ఆసక్తిగలవారు వేలం పాటలో పాల్గొనవచ్చునని చెప్పారు.

నేడు కన్నెగంటి జయంతి

కొయ్యలగూడెం : స్వాతంత్ర్య సమరయోధుడు, పుల్లరి ఉద్యమ నేత కన్నెగంటి హనుమంతు జయంతి కార్యక్రమం బుధవారం ఉదయం 9 గంటలకు గణేష్ సెంటర్‌లో నిర్వహిస్తున్నట్లు కాపు సంఘం నేత బోడిపిండి సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. మండల, పట్టణ కాపు సంఘాలు, అనుబంధ కమిటీల సభ్యులు హాజరు కావాల్సిందిగా ఆయన కోరారు.

సాగునీటి చెరువు పూడుకుపోతోందని ఆవేదన

కొయ్యలగూడెం : బయ్యనగూడెంలోని రామకోనేరు పూడ్చివేతకు గురవుతోందని దీనివల్ల సాగునీటి సరఫరాకు ఆటంకాలు ఏర్పడతాయంటూ ఆయకట్టు రైతులు మంగళవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. జాతీయ ప్రధాన రహదారి అభివృద్ధి, విస్తరణ నేపథ్యంలో రోడ్డుకిరువైపులా పూడికతీత మట్టి తొలగిస్తున్నారు. ఈ మట్టిని ట్రక్కుల ద్వారా గుత్తేదారు గ్రామంలోని కోనేరులో వేస్తున్నారని రైతులు చెబుతున్నారు. దీంతో చెరువు నీరు కలుషితమవుతోందని, చెరువులో నీటి సామర్థ్యం తగ్గిపోయే ప్రమాదం ఉందదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఆర్‌అండ్‌బీ అధికారులు, పంచాయతీ చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తిచేయాలి


లబ్ధిదారులతో మాట్లాడుతున్న గృహనిర్మాణ శాఖ ఈఈ

బుట్టాయగూడెం (జీలుగుమిల్లి) : జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసేవిధంగా కృషి చేయాలని గృహ నిర్మాణ శాఖ ఈఈ ఇ.నరసింహరావు అన్నారు. జీలుగుమిల్లి మండలం దర్భగూడెంలో జగనన్న కాలనీ నిర్మాణ పనులను ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్మాణ పనుల్లో ఎటువంటి లోపాలు లేకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. త్వరితగతిన ఇళ్లు నిర్మించుకునే లబ్ధిదారులకు ప్రభుత్వం అందించే నగదు వారి ఖాతాలోనే జమ చేయడం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఏఈ ప్రసాద్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ సువర్ణ, సచివాలయ కన్వీనర్‌లు జగన్ మోహన్‌రెడ్డి, గుర్రాల సురేష్, హౌసింగ్ ఇన్‌స్పెక్టర్ నిట్టా సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల చెంతకు తప్పిపోయిన బాలిక


తండ్రితో తప్పిపోయిన బాలిక భాను

కుకునూరు : తప్పిపోయిన బాలిక తల్లిదండ్రులకు చెంతకు చేరింది. వివరాలు ఇలా ఉన్నాయి. కుక్కునూరుకు చెందిన ఊకే ధర్మయ్య కుటుంబం బ్రతుకుతెరువు కోసం ద్వారకాతిరుమల మండలం వెళ్లింది. చిన్నారి భాను మంగళవారం ఉదయం తప్పిపోయి తూర్పుయడవల్లి చేరింది. అక్కడ బాలిక ఏడుస్తుండటాన్ని చూసి స్థానికులు సత్యసాయి ట్రస్ట్‌కు సమాచారం ఇచ్చారు. దీంతో ట్రస్ట్ సభ్యులు జంగారెడ్డిగూడెం పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వగా, బాలిక తన స్వగ్రామం కుకునూరు అని చెప్పడంతో కుకునూరు పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. కుకునూరు సీఐ, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు రావు వినోద్ సహకారంతో చిన్నారి ఫొటోను, తప్పిపోయిన సమాచారాన్ని సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు. దీంతో స్థానికులు బాలికను గుర్తించి వివరాలు తెలియజేయడంతో తల్లిదండ్రులకు బాలికను అప్పగించారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): రహదారి భద్రతా నియమాలు పాటించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.రాజేశ్వరి సూచించారు. మంగళవారం స్థానిక సెయింట్ థెరిస్సా కళాశాలలో విద్యార్థినులకు ట్రాఫిక్ నిబంధనలు, వాహన చట్టం, డ్రైవింగ్ లైసెన్స్ తీసుకునే విధానం, న్యాయ సేవాధికార సంస్థ కార్యకలాపాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. వాహనచోదకులంతా తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ జి.స్వామి మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో డ్రైవింగ్ లైసెన్స్ పొందే విధానాన్ని విద్యార్థినులకు డెమో ద్వారా నేర్పారు.

విద్యార్థులను అభినందించిన జేసీ


తృతీయ బహుమతిని అందుకుంటున్న విద్యార్థులు

బుట్టాయగూడెం : ఏలూరులో జరిగిన జిల్లా స్థాయి విద్యావైజ్ఞానిక ప్రదర్శనలో తమ పాఠశాల విద్యార్థులు ఏర్పాటు చేసిన నమూనా స్టాల్‌కు తృతీయ బహుమతి లభించినట్లు విద్యారోహిణీ హైస్కూల్ ప్రిన్సిపాల్ కొండేపాటి రామకృష్ణ తెలిపారు. ఈ బహుమతిని జిల్లా జాయింట్ కలెక్టర్ పి.అరుణ్‌బాబు చేతుల మీదుగా విద్యార్థులు అందుకున్నారని చెప్పారు. ఈ సందర్భంగా 9వ తరగతి విద్యార్థులు షేక్ హర్షద్ తన్వీర్, మధుకూరి నాగసాయి ప్రమోద్‌లను ఎంఈఓ టి.బాబూరావు, ప్రిన్సిపాల్ రామకృష్ణ అభినందించారు.

పంటలను పరిశీలించిన ఏవో


అంకన్నగూడెంలో పంటల వివరాలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి రామకృష్ణ

బుట్టాయగూడెం (జీలుగుమిల్లి) : అర్హులైన రైతులు ప్రతి ఒక్కరూ తమ పంటల వివరాలను తప్పనిసరిగా ఈకేవైసీ చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి వై.రామకృష్ణ అన్నారు. జీలుగుమిల్లి మండలం అంకన్నగూడెం, కామయ్యపాలెం, బర్రింకలపాడు, వంకవారిగూడెం గ్రామాల్లో ఆయన మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని మొక్కజొన్న, వైట్ బార్లీ, పొగాకు తదితర పంటలను ఈకేవైసీ నమోదు సమగ్రంగా చేశారో లేదో పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో 47 వేల ఎకరాల్లో రైతులు మొక్కజొన్న పంట సాగుచేస్తున్నారని చెప్పారు. లక్షా 28 వేల ఎకరాల్లో వరిపంట పండిస్తున్నారని, అలాగే ఈ ప్రాంతంలో వర్జీనియా పొగాకుతోపాటు వైట్ బార్లీ పంటలను కూడా రైతులు అధికంగా వేశారని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మల్లం వసంతరావు, ఏఓ కె. గంగాధరం, ఏఈఓలు పాల్గొన్నారు.

బంజరు భూములను పేదలకు పంపిణీ చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న మన్నవ కృష్ణచైతన్య

టి నరసాపురం : ప్రభుత్వం అటవీ బంజరు భూములను పేదలకు పంపిణీ చేయాలని సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య డిమాండ్ చేశారు. సీపీఐ మండలం కార్యదర్శి సాకా గంగరాజు అధ్యక్షతన మంగళవారం టి.నరసాపురంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణచైతన్య మాట్లాడుతూ టి నరసాపురం, బందంచర్ల గ్రామాల్లో నిరుపయోగంగా ఉన్న అటవీ బంజరు భూముల్లో ప్రభుత్వం వన సంరక్షణ సమితులను ఏర్పాటు చేసి భూమి లేని పేదలకు కుటుంబానికి హెక్టారు చొప్పున భూ పంపిణీ చేయాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు, సీపీఐ జిల్లా సమితి సభ్యులు పుప్పాల కన్నబాబు, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి దొంత కృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి తాడిగడప జయరాజు తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా అభివృద్ధి పనులు

ఏలూరు టౌన్: ఏలూరు శివారు శనివారపుపేట ప్రాంతంలోని జగనన్న టౌన్‌షిప్‌లో అభివృద్ధి పనులను శరవేగంగా పూర్తి చేయాలని ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఇడా) చైర్‌పర్సన్ మధ్యాహ్నపు ఈశ్వరి అన్నారు. పనుల ప్రగతిపై ఏలూరు చంద్రగుప్తకాలనీలోని ఇడా కార్యాలయంలో మంగళవారం అధికారులతో సమీక్షించారు. ఇడా ఆధ్వర్యంలో చేపట్టే పలు అభివృద్ధి పనుల ప్రగతి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని, ప్రత్యేకంగా పర్యవేక్షణ చేయాలని అధికారులను ఆదేశించారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని తెలిపారు. అనుమతులు లేని లేఅవుట్లపై చర్యలు తీసుకోవాలని, ప్లానింగ్ అధికారులు నిత్యం అనధికార లేఅవుట్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ఇడా పరిధిలోని పలు ప్రాంతాల్లో పార్కుల అభివృద్ధికి చర్యలు తీసుకున్నామని చెప్పారు. సమావేశంలో ఇడా వైస్ చైర్మన్ డి.చంద్రశేఖర్, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు మధ్యాహ్నపు బలరాం, పీఓ సురేఖ, డీఈ సత్యనారాయణ, సిబ్బంది ఉన్నారు.

అంజన్న సన్నిధిలో


శ్రీలక్ష్మీనారాయణకు స్వామివారి చిత్రపటాన్ని అందజేస్తున్న ఈవో కొండలరావు

జంగారెడ్డిగూడెం రూరల్ : మండలంలోని గురవాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయస్వామిని మంగళవారం సినీ నటులు శ్రీలక్ష్మీనారాయణ దర్శించుకున్నారు. ఆలయ ఈవో ఆకుల కొండలరావు ఆలయ మర్యాదలతో ఆయనకు స్వాగతం పలికారు. స్వామి వారి దర్శనం అనంతరం అర్చకులు ఆశీర్వచనాలు అందజేశారు. శేషవస్త్రాన్ని కప్పి స్వామి వారి చిత్రపటాన్ని, ప్రసాదాన్ని లక్ష్మీనారాయణకు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

గౌరవ వేతనం పెంచాలని ఆందోళన



ఎంఈవో కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

చింతలపూడి : మధ్యాహ్న భోజన కార్మికులకు గౌరవ వేతనం రూ.10 వేలు చెల్లించాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మండల విద్యా వనరుల కేంద్రం ముందు మంగళవారం మధ్యాహ్న భోజన కార్మికులు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా నాయకులు కె.బుచ్చిబాబు మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులకు గ్యాస్ ప్రభుత్వమే అందించాలన్నారు. ఒక్కో విద్యార్థికి రూ.20 చెల్లించాలన్నారు. గుర్తింపు కార్డులు ఇవ్వడంతో పాటు పీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మిక సంఘం నాయకులు పకీరమ్మ, బి.మరియమ్మ, కె.కుమారి తదితరులు పాల్గొన్నారు.